క్లుప్తంగా

శాలివాహన సత్రం అధ్యక్షుడిగా మోహన్‌రావు


మోహన్‌రావు

మార్కాపురం టౌన్‌: శ్రీశైలం శాలివాహన అన్న దానసత్రం నూతన అధ్యక్షుడిగా మార్కాపురం పట్టణానికి చెందిన మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ చాతరాజుపల్లి అంజమ్మ శ్రీనివాసులు సోదరుడు మోహన్‌రావు ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన సమావేశంలో మోహన్‌రావును సత్రం అధ్యక్షునిగా నియమించారు. ఆయనను శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలాపురం వెంకయ్య తదితరులు అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గిద్దలూరు రూరల్‌: విద్యార్థులకు చదవడంపై ఆసక్తి కల్పించాలని గ్రంథపాలకురాలు నల్లబోతుల ప్రసన్నకుమారి పేర్కొన్నారు. చదవడం మాకిష్టం అనే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు పలు అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వ్యాసరచనలో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఫరూక్‌, రామిరెడ్డి, కృష్ణకిషోర్‌ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారికి ఆషాఢమాసం పూజలు


అమ్మవారికి నైవేద్యాలు సమర్పించిన మహిళా భక్తులు

పెద్దదోర్నాల: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు కుంకుమలతో పాటు చీరె, సారెలను సమర్పించుకున్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌ను పసిడి, రజిత ఆభరణాలు, పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ అర్చకులు బిదరె రాంప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున 5 గంటలకు అమ్మవారికి సుప్రభాతసేవ, క్షీరాభిషేకం, సహస్ర నామార్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళా భక్తులచే అమ్మవారికి లలితా సహస్రనామ పారాయణం, మహా మంగళ హారతి, వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఒడి బియ్యంతో పాటు అమ్మవారికి పలు రకాల నైవేద్యాలను సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళా భకులు తొలుత మండల కేంద్రంలోని వీధుల గుండా మేళ తాళాల నడుమ ఊరేగింపు నిర్వహించి వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయానికి చేరుకున్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

మార్కాపురం: కరాటేతో ఆత్మవిశ్వాసంతోపాటు ఆత్మరక్షణ పొందవచ్చని కరాటే చీఫ్‌ ఎగ్జామినర్‌ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కోర్టు సెంటరులోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన టెస్టుకు ముఖ్య అతిథిగా జూనియర్‌ సివిల్‌ జడ్జి జె.కిశోర్‌కుమార్‌ హాజరై గ్రేడింగ్‌ సాధించిన విద్యార్థులను అభినందించారు. మొత్తం 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గతేడాది ఎస్‌జీఎఫ్‌ స్కూల్‌ గేమ్స్‌లో బెల్టు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్‌ ఇన్‌స్ట్రక్టర్‌ తోట ప్రసాద్‌, విద్యార్థులు పాల్గొన్నారు.


గ్రేడ్‌ సాధించిన విద్యార్థులతో ఎస్‌జీఎఫ్‌ నిర్వాహకులు


చిన్నకంభంలో ప్రారంభించి నిరుపయోగంగా వదిలేసిన ఆర్బీకే, హెల్త్‌ క్లినిక్


యర్రబాలెంలో చివరదశలో నిలిచిపోయిన బల్క్‌మిల్క్‌ చిల్లింగ్‌ సెంటర్‌

నాడు అభివృద్ధి.. నేడు నాశనం !

- ఎల్‌కోటలో నిర్మాణం పూర్తయినా ప్రారంభం కాని సచివాలయం
- కూటమిపాలనలో కుంటుపడుతున్న అభివృద్ధి
- నిలిచిపోయిన సచివాలయాలు, రైతుసేవా కేంద్రాలు, హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణాలు


ఎల్‌కోటలో ప్రారంభానికి నోచుకోని సచివాలయం, రైతుసేవాకేంద్రాలు, హెల్త్‌ క్లినిక్‌

కంభం:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసేలా అడుగులు వేస్తుండటంతో పాలన కుంటుపడిపోతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు ఎటువంటి సేవలైనా ఇంటి ముంగిటకే చేరాలన్న ధృఢ సంకల్పంతో గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టింది. అందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల భవనాల నిర్మాణాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్‌ క్లినిక్‌లు, అవసరమైన చోట మిల్క్‌బల్క్‌ చిల్లింగ్‌ కేంద్రాల నిర్మాణాలను ప్రారంభించింది. గడిచిన ఐదేళ్లలో చాలా చోట్ల నిర్మాణాలు పూర్తి చేసుకోగా కొన్ని చివరిదశలో, మరికొన్ని వివిధ దశల్లో నిలవగా మరికొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తి చేసుకొని ఎలక్షన్‌ కోడ్‌ వచ్చిన నేపథ్యంలో ప్రారంభాలు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందానా భవనాల నిర్మాణాల పనులు ఆగిపోయాయి. చాలా చోట్ల 90 శాతం నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాలను సైతం పూర్తి చేసి ప్రారంభించకుండా అలాగే వదిలేయడంతో సచివాలయ సిబ్బంది అద్దె భవనాల్లో కాలంగడుపుతున్నారు. దీంతో ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదు.

వివిధ దశల్లో నిలిచిన నిర్మాణాలు..

మండలంలో 14 సచివాలయాలకు గాను కంభం -4, కందులాపురం-3, జంగంగుంట్ల సచివాలయాల నిర్మాణాల పనులు నేటికి ప్రారంభం కాలేదు. ఎల్‌కోట సచివాలయ నిర్మాణం దాదాపు పూర్తయినా దాన్ని ప్రారంభించేందుకు అధికారులు చొరవ చూపడం లేదు. మండలంలో 14 రైతు భరోసా కేంద్రాలకు గాను జంగంగుంట్ల, కంభం -4, కందులాపురం-3 లో నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఎల్‌కోటలో చివరిదశకు చేరి ఉంది. చిన్నకంభం రైతు భరోసా కేంద్రం ప్రారంభించినప్పటికీ దాన్ని వినియోగించుకోవడంలేదని స్థానిక రైతులు చెబుతున్నారు. హెల్త్‌క్లినిక్‌ లు మండలంలో 9 మంజూరు కాగా 6 చోట్ల పనులు ప్రారంభించలేదు. ఎర్రబాలెంలో శ్లాబ్‌ లెవల్‌ నిలిచిపోయింది. కంభం-1, పెద్దనల్లకాల్వ, రావిపాడులో మాత్రమే ప్రారంభించి వినియోగంలో ఉన్నాయి. యర్రబాలెం లో గ్రామంలో నిర్మిస్తున్న మిల్క్‌బల్క్‌ చిల్లింగ్‌ కేంద్రం శ్లాబు, ప్లాస్టింగ్‌ వరకు పూర్తికాగా ఆ తర్వాత ఆ పనులు నిలిచిపోయాయి.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

గ్రామాల్లో నిర్మాణదశలో ఉన్న ప్రభుత్వ భవనాలు మందుబాబులకు అడ్డాగా మారిపోతున్నాయి. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా వాటిని పట్టించుకోక పోవడంతో పరిసరాలు చిల్లచెట్లు పెరిగిపోయి అధ్వానంగా కనిపిస్తున్నాయి. అధికారులు స్పందించి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సచివాలయాల నిర్మాణాలు పూర్తిచేయాలి..



నిర్మాణాలు పూర్తి చేసుకున్న ప్రభుత్వ భవనాలను అధికారులు వెంటనే ప్రారంభించి ప్రజలకు మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకోవాలి. నిర్మాణాలు మధ్యలో ఉన్న వాటిని సైతం త్వరితగతిన పూర్తి చేసేలా ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– మహమ్మద్‌ ఇబ్రహీం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి

సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం..



గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ, రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందేవి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసేలా అడుగులు వేస్తుంది. అర్ధాంతరంగా నిలిచిన ప్రభుత్వ భవనాలను వెంటనే పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలి.

అవ్వారి గురుమూర్తి, వైఎస్సార్‌ సీసీ యూత్‌వింగ్‌ నాయకుడు

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


సమావేశ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్‌: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత వైఎస్సార్‌ సీపీ శ్రేణులపై ఉందని ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై సోమవారం గిద్దలూరులోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశ ఏర్పాట్లను ఆదివారం పరిశీలించి పార్టీ నేతలతో మాట్లాడారు. విస్తృత స్థాయి సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డితోపాటుగా పలువురు ముఖ్య నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌ సీపీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు చేయాల్సిన కృషిపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం హామీలు గాలికొదిలేసి దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులతో అరాచక పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. ఎన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నప్పటికీ పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలను విస్మరించబోమన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌ సీపీ నాయకులు వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, మానం బాలిరెడ్డి, బత్తిని ఓబుల రావు, డాక్టర్‌ భూమా నరసింహారెడ్డి, సీఆర్‌ఐ మురళి, చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, స్వామిరంగారెడ్డి, పాలుగుళ్ల సుబ్బారెడ్డి, వెంకటరావు, పాలుగుళ్ల నరసింహారెడ్డి, మిత్రారెడ్డి, దిలీప్‌ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పీర్ల నిమజ్జనం

బేస్తవారిపేట: మండలంలోని శింగరపల్లె, మోక్షగుండంలో మొహర్రం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్ద షహాదత్‌ సందర్భంగా పీర్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు. అగ్ని గుండం ఏర్పాటు చేసి పీర్ల ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊరేగింపుగా గ్రామ శివారులో జల్దికి తరలించారు.

ప్లాస్టిక్‌ కవర్లు వినియోగిస్తే చర్యలు


ప్లాస్టిక్‌ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న కమిషనర్‌ నారాయణరావు

సాక్షి ఎఫెక్ట్‌..

మార్కాపురం: సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ కవర్లు వాడితే చర్యలు తప్పవని కమిషనర్‌ డీవీ నారాయణరావు హెచ్చరించారు. మార్కాపురంలో ప్లాస్టిక్‌ కవర్ల వినియోగంపై ఈనెల 16న ‘సాక్షి’లో ‘కవర్‌ కే పవర్‌.. హెచ్చరికలు బేఖాతర్‌’ శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్‌, నిత్యవసర సరుకుల దుకాణాలను తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో ప్లాస్టిక్‌ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. పేపర్‌ బ్యాగులు, జూట్‌ బ్యాగులు, క్లాత్‌ బ్యాగులు వాడాలని సూచించారు.

కోటసత్యమాంబదేవికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి


శాకంబరి అలంకారంలో అమ్మవారు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

అర్ధవీడు: ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా మండలంలోని అంకభూపాలెం, పాపినేనిపల్లిలో పోలేరమ్మ తల్లికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. వర్షాలు కురిసి పాడిపంటలు సస్యశ్యామలంగా ఉండాలని కాంక్షిస్తూ భక్తులు అమ్మవారికి 101 ప్రదర్శనలు చేశారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

శాకంబరిగా అల్లూరి పోలేరమ్మ

మార్కాపురం టౌన్‌: ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా అల్లూరి పోలేరమ్మ అమ్మవారిని శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని అర్చకులు వెంకటేశ్వర్లు, పవన్‌ కుమార్‌ శర్మ పుష్పాలు, నిమ్మకాయల దండలతో అలంకరించారు. పలువురు భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అమ్మవారిని పలురకాల కూరగాయలతో అలంకరించి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం


ఊరేగింపుగా బోనాలు తీసుకెళ్తున్న మహిళలు



అనుమలవీడులో ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి

రాచర్ల: మండలంలోని అనుమలవీడు గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. తొలుత గ్రామంలోని మహిళలు బోనాలు, బొల్లావుతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయడంతోపాటు అన్న సంతర్పణ చేశారు.

నేడు విద్యుత్‌ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో నూతన విద్యుత్‌ లైన్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో సోమవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని రాజుపాలెం సబ్‌స్టేషన్‌ పరిధిలోని ముక్తాపురం వ్యవసాయ ఫీడర్‌కు సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపి వేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పశ్చిమ ప్రకాశంలో మోస్తరు వర్షం


మార్కాపురంలో కమ్ముకున్న కారుమబ్బులు


కొనకనమిట్లలో వర్షం కురుస్తున్న దృశ్యం

మార్కాపురం/కొనకనమిట్ల: మార్కాపురం నియోజకవర్గంలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై కారుమేఘాలు కమ్ముకున్నాయి. గత రెండు రోజులుగా మార్కాపురం పరిసర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. కొనకనమిట్ల మండలంలోనూ ఓ మోస్తరు జల్లులు పడ్డాయి. సజ్జ, కంది, పత్తి, కూరగాయలు సాగుచేసిన రైతులకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

సమ్మె చేస్తున్నా స్పందించరా?



నిరసన తెలుపుతున్న కార్మికులు

- గిద్దలూరులో కార్మికుల నిరసన

గిద్దలూరు రూరల్‌: సమస్యల పరిష్కారం కోసం గత 5 రోజుల నుంచి సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని మున్సిపల్‌ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్‌ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్‌, పారిశుధ్య కార్మికులు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్‌ ఇంజినీరింగ్‌, పారిశుధ్య కార్మికులకు జీఓ నంబర్‌ 36 ప్రకారం వేతనం చెల్లించాలని, కేటగిరీ వైజ్‌గా కార్మికులందరికి వేతనాలు చెల్లించాలని, రిటైరైన కార్మికుల పిల్లలకు ఉద్యోగం కల్పించాలని, వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయడం సరికాదన్నారు. సమస్యల సాధన కోసం ఐకమత్యంతో పోరాడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు మురళి, చంటెయ్య, బాలయ్య, రంగయ్య, పుల్లయ్య, నాగయ్య, రంగస్వామి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.